

ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయండి

చేవెళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కే.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి కోరారు. శనివారం చేవెళ్లలో వారు మాట్లాడుతూ.. ఈనెల 31న మండల కేంద్రంలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రిటిష్ వాళ్లు భారత దేశాన్ని పరిపాలిస్తున్న తరుణంలోనే ఏఐటీయూసీ కార్మిక సంఘం ఏర్పడిందన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసి ఎన్నో చట్టాలను తీసుకువచ్చిందన్నారు.



ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలు పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా

రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సీపీ

ఆదిభట్ల, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచుతూ అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది సామాన్యులకు అందిస్తున్న సేవలను సమీక్షించేందుకు శనివారం కమిషనరేట్ పరిధిలోని ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డు గదిలో ఫైళ్లను ఆయన పరిశీలించారు. రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ తదితర విభాగాలు, సీసీ టీవీల నిర్వహణ తీరును ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవేందర్ రెడ్డి తోపాటు ఎస్సైలు వెంకటేష్, పి.రాజు, కే.రాజు సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్‌గా వాణిరెడ్డి



మహేశ్వరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులోభాగంగా తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకట్‌రాం జల్‌పల్లి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. జల్‌పల్లిలో పని చేస్తున్న అల్లూరి వాణిరెడ్డి తుక్కుగూడకు వచ్చారు.

టీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు



షాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సోషలిస్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చందన్‌వెల్లి గ్రామానికి చెందిన నీరటి ఆంజనేయులును నియమించారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో చందన్‌వెల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిలో అవకతవకలు జరిగాయని, భూనిర్వాసితులకు న్యాయం జరిగేలా పోరాడుతామన్నారు.

ఉచిత శిక్షణతో ఉపాధి

ఎంపీ డాక్టర్ మల్లు రవి



ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తుందని నాగర్‌కర్నూల్ ఎంపీ, పార్లమెంటరీ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆమనగల్లులో శనివారం పార్లమెంటరీ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన మల్లు రవికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ్మా, తెల్గమల్ల జగన్, వస్పుల మానయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫొటోషూట్ కోసం ఏర్పాటు చేసిన సెట్టింగ్

Sunday Special

మండే ఎండ.. మంచు తుపాను

షూటింగ్ స్పాట్‌గా మూడుచింతలపల్లి

- నట్టింట నక్షత్రాలు, తేలియాడే పడవలు
- ఇలాంటి స్పాట్లన్నీ ఒకేచోట కనువిందు
- అందమైన సీనరీలతో లోకేషన్ల ఏర్పాటు
- ఆయా స్పాట్స్‌ను అద్దెకిస్తూ వ్యాపారం
- లోకేషన్స్‌తో పాటు, సకల వసతులు

పెళ్లి, శారీ ఫంక్షన్.. ఇలా కార్యక్రమం ఏదైనా ఫొటోషూట్ పక్కా. ప్రధానంగా ఇటీవల కాలంలో ప్రీవెడ్డింగ్ షూట్‌లు తప్పనిసరిగా మారాయి. ఈ నేపథ్యంలో ఫొటోషూట్ స్పాట్‌లకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ఈ రకమైన షూటింగ్‌ల కోసం నగర శివారులో స్టూడియోలను ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాంటి ఫొటోషూట్‌లకు మూడు చింతలపల్లి మండలం కేరాఫ్‌గా మారింది. అక్కడ ఏర్పాటు చేసిన షూటింగ్ స్పాట్‌లు, వసతులు తదితర అంశాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

మూడుచింతలపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉదయించే సూర్యుడైనా, సంధ్య వేళ పలకరించే చంద్రుడైనా, సప్త సముద్రాలు, ఎవరెస్ట్ శిఖరం, ఢిల్లీలోని ఎర్రకోట, హైదరాబాద్‌లోని చార్మినార్, గలగల పారే గోదారి, ఇసుక ఎడారి.. ఇలాంటి ప్రదేశాల్లో మీకు ఎక్కడ ఫొటో షూట్ చేయాలని అనిపించినా.. ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. అదేంటని అవాక్కయ్యారా..! వాటన్నింటినీ ఒకేచోటకు తీసుకొచ్చారు

మిగతా 7వ పేజీలో...



ఫొటోషూట్ కోసం బావి సెట్టింగ్

దుక్కి దున్నిన.. పాలు పితికిన!

- పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా..
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాకు గురు సమానులు
- ఈ జీవితం ప్రజల సేవకే అంకితం
- ఎమ్మెల్యే కావాలనే నా కోరిక ఇంకా తీరలే..
- సొంతూరు జిల్లెలగూడలో గుడి, బడి కట్టిచ్చా
- రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

"మాది వ్యవసాయ నేపథ్యం ఉన్న కుటుంబం.. మా నాన్న ఎక్కువగా కూరగాయ పంటలు సాగు చేసేవారు. నేను కూడా సమయం ఉన్నప్పుడు పొలానికి వెళ్లి పనులు చేసేవాడిని. నాగలి పట్టి దుక్కులు దున్నేవాడిని... విత్తనాలు విత్తాను.. గేదెలకు మేత వేసి పాలు పితికాను.. పెదనాన్న లింగారెడ్డి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చాను. కాంగ్రెస్ పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న. ఎమ్మెల్యే కావాలన్న నా కోరిక ఇంకా తీరలేదు. నా రాజకీయ గురువుల్లో మొదటగా మా పెదనాన్న.. ఆ తర్వాత వైఎస్సార్" అని రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తన మనోగతాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. మరికొన్ని విషయాలు ఆయన మాటల్లో...

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)


7



ఇన్నర్ వ్యూ

మన్నించమ్మా.. మహమ్మాయిదేవి!

- ప్రతీయేట కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాలు
- పాలక మండలి నిర్లక్ష్యం.. అపరిశుభ్రంగా ఆలయం
- కోనేరులో దర్శనమిస్తున్న చెత్తాచెదారం
- నీట మునిగిన హనుమాన్ విగ్రహం



8

మేడ్చల్ కాంగ్రెస్‌లో అయోమయం

- చాపకింద నీరులా గ్రూపు రాజకీయాలు
- ఎవరికి వారే బాస్‌లుగా బడా నేతలు
- పార్టీలో కొత్తగా చేరిన వారికి పెద్దపీట
- సీఎం రేవంత్ వద్దకు సీనియర్ల పంచాయితీ



7

కాంగ్రెస్ ప్రభుత్వానిది హైడ్రామా

- ఆరు గ్యారెంటీలను పక్కకు పెట్టేసిన సీఎం రేవంత్
- పూర్తి స్థాయిలో అమలుకాని రైతు రుణమాఫీ
- వీధులపాలైన విద్య, వైద్య శాఖలు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



8

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం తలకొండపల్లి మండలం కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా నాయకుడు ఇస్లావత్ వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరటి భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమనగల్లు - షాద్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్కాలర్ షిప్ డబ్బులు అందక వేలాది మంది పేద విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేస్తున్నారని, కళాశాలల నిర్వాహకులు సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విచారకరమన్నారు. నాయకులు విజయ్‌కుమార్, వెంకటేశ్, లండం మల్లేశ్, భరత్, నందు, మల్లేశ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ హరీష్ చంద్రారెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ హరీష్ చంద్రారెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయించినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని, అప్పుడే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, నార్కోటిక్ సీఐలు శ్రీనివాస్‌రావు, గోపి, కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ హరీష్ చంద్రారెడ్డి

గ్రంథాలయ భవనానికి తాళం

నిర్మాణ బిల్లు రాలేదని కాంట్రాక్టర్ ఆవేదన

- ప్రారంభానికి నోచని నూతన బిల్డింగ్
- ఇరుకైన అద్దె భవనంలో కొనసాగింపు
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు

కొత్తూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు పూర్తిచేసుకొని పది నెలలైనా ప్రారంభానికి నోచడం లేదు. కాంట్రాక్టర్‌కు బిల్లు రాకపోవడంతో భవనానికి తాళం వేసుకున్నాడు. దీంతో గ్రంథాలయం ఇంకా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. కొత్తూరులోని పాత గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2022లో నూతన భవనానికి గత ప్రభుత్వం రూ.75లక్షలు మంజూరు చేసింది. అప్పటి మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ డబ్బులు భవన నిర్మాణానికి సరిపోలేదు. కాంట్రాక్టర్ సొంత పైసలతో భవన నిర్మాణాన్ని పూర్తిచేశాడు. బిల్లులు చెల్లిస్తేనే భవనాన్ని అప్పగిస్తానని తాళం వేసుకున్నాడు. రెండేళ్లుగా చిన్న అద్దె భవనంలో గ్రంథాలయాన్ని నడుపుతున్నారు. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయ నూతన భవనాన్ని ఇటీవల షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ పరిశీలించారు. దానికి తాళం వేసి ఉండటం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. లైబ్రేరియన్ శ్రీనివాస్‌రాజును అడిగి వివరాలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే నూతన భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేయించి, భవనాన్ని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.



తాళం వేసి ఉన్న కొత్తూరు గ్రంథాలయ నూతన భవనం

టీకాల కార్యక్రమం పరిశీలన



పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

మాడ్గుల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శనివారం అప్పారెడ్డిపల్లిలో నిర్వహించారు. పశు వైద్య శిబిరాన్ని జిల్లా వెటర్నటీ అధికారి శ్రీనివాస్‌కుమార్, టీకాల మానిటరింగ్ అధికారి అనిల్‌కుమార్‌లు పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 5,341 పశువులకు టీకాలు వేశామని, మరో 6వేల పశువులకు టీకాలు వేయాల్సి ఉందని మండల పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి తెలిపారు.

'ఉపాధి' పని తీరును మెరుగుపర్చాలి



ఉపాధి పనులపై వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

నవాబుపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల తీరును సిబ్బంది మెరుగుపర్చాలని డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం నవాబుపేట మండల పరిషత్‌లో సామాజిక తనిఖీ నిర్వహించారు. సోషల్ ఆడిట్ బృందాలతో 32 పంచాయతీల్లో 2023-24కు సంబంధించిన సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. కొన్ని గ్రామాల్లో చిన్న పొరపాట్లు చేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై తప్పులు జరగకుండా సిబ్బంది జాగ్రత్తగా పనిచేయాలని ఏపీవో లక్ష్మీమాధవిని ఆదేశించారు. పొరపాట్లు జరిగిన రూ.1.56లక్షలను రికవరీ చేయాలని ఆదేశించారు. సిబ్బందికి రూ.26,900 జరిమానా విధించామన్నారు. కుమ్మరిగూడ, వట్టిమీనపల్లి, ఏక్‌మామిడి, మూలమడ, యావాపూర్ గ్రామాల్లో తప్పులు జరిగినట్టు గుర్తించామన్నారు. సమావేశంలో ఏపీడీ సరళ, అంబుడ్స్‌మన్ రాములు, ఎంపీడీవో అనురాధ, ఏపీఎం భార్గవి, ఎస్సార్పీ రమేశ్, ఎంపీవో విజయ్‌కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్, ఏపీవో లక్ష్మీదేవి, ఈసీ జ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, టెక్నికల్/ఫీల్డ్ అసిస్టెంట్లు, పలువురు కూలీలు పాల్గొన్నారు.

చేవెళ్ల గ్రంథాలయ భవనం

పనులు ప్రారంభిస్తాం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



చేవెళ్ల గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేవెళ్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):చేవెళ్లలో త్వరలోనే గ్రంథాలయ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. 'గ్రంథాలయం శిథిలం' శీర్షికతో ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మధుసూదన్‌రెడ్డి శనివారం చేవెళ్ల గ్రంథాలయ పాత భవనాన్ని పరిశీలించారు. అక్కడున్న వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి ఇప్పటికే రూ.1.80కోట్లు మంజూరయ్యాయని, మరిన్ని నిధులు కేటాయించి లైబ్రరీని హంగులతో నిర్మించేందుకు కృషిచేస్తానన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు సున్నపు వసంతం, చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, వీరేందర్‌రెడ్డి, శైలజాఆగిరెడ్డి, అధికారులు ఉన్నారు.

మొయినాబాద్‌లోనూ నూతన భవన నిర్మాణం

మొయినాబాద్: మొయినాబాద్ గ్రంథాలయన్ని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. లైబ్రరీలో అన్ని రకాల పుస్తకాలను సమకూరుస్తామని, ఇదే స్థలంలో నూతన భవన నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు షాబాద్ దర్శన్, ప్యాక్స్ చైర్మన్ రాంచంద్రరెడ్డి, రాజుగౌడ్, మహేందర్ ముదిరాజ్, రాజేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి ఉన్నారు.

షాబాద్ గ్రంథాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం

షాబాద్: షాబాద్‌లో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని మధుసూదన్‌రెడ్డి అన్నారు. సెక్రటరీ మనోజ్‌తో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించారు. లైబ్రరీకి కాంపౌండ్ వాల్ కట్టిస్తామన్నారు. త్వరలోనే ఈ నూతన భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆయనతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు రాహుల్, అక్తర్ పాషా, అన్వర్, సుభాష్‌రెడ్డి, స్వామి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జానీ, కృష్ణ, గౌరీశ్వర్, సత్యనారాయణ, ప్రశాంత్, జలీల్, రమేష్ ఉన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని జేఎన్టీయూహెచ్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. మేడ్చల్, మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి విద్యార్థులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దుక్కి దున్నిన.. పాలు పితికిన

- పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి..
- వైఎస్ఆర్ నాకు గురు సమానులు
- ఈ జీవితం ప్రజలకే అంకితం
- ఎమ్మెల్యే కావాలనే నా కోరిక తీరలే..
- సొంతూరు జిల్లెలగూడలో గుడి, బడి కట్టిచ్చా
- రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి



దివంగత వైఎస్సార్‌తో చల్లా నర్సింహారెడ్డి(ఫైల్)

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మా ఊరు జిల్లెలగూడ, సరూర్‌నగర్ మండలం. నా తల్లిదండ్రులు చల్లా లక్ష్మమ్మ-పాపిరెడ్డి. మాది వ్యవసాయ కుటుంబం. ఓల్డ్ సిటీకి చెందిన చల్లా శశిరేఖతో 1993లో వివాహం అయ్యింది. ఇద్దరు పిల్లలు. బాబు రిత్‌న్‌రెడ్డి ఎల్ఎల్‌బీ, పాప రిషికారెడ్డి ఎంబీఏ చదువుతోంది. మేము ముగ్గురు అన్నదమ్ముళ్లం. ఇంట్లో నేనే పెద్ద. ఇద్దరు తమ్ముళ్లు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి. ఇంకా ఉమ్మడిగానే ఉంటున్నాం. మా పెద్దనాన్న చల్లా లింగారెడ్డి జిల్లెలగూడ సర్పంచ్‌గా 25 ఏళ్ల సేవలందించారు.

గుడి, బడి కట్టించా

జిల్లెలగూడ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకున్నాను. తర్వాత 5 నుంచి 7వ తరగతి వరకు చంపాపేట్‌లో, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సరూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకున్నాను. ఇంటర్ బొగ్గులకుంటలోని ప్రగతి విద్యాలయంలో పూర్తి చేశాను. హైదరాబాద్‌లోని విద్యానగర్ రామచంద్ర కాలేజీలో చదివాను. నేను చదువున్న స్కూల్ శిథిలావస్థకు చేరడంతో సొంత డబ్బు ఖర్చు పెట్టి బడి నిర్మించాను. రూ.1.20 లక్షలు ఖర్చు పెట్టి బెంచీలు చేయించాను. వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పునఃనిర్మించాం.

మా గ్రామం నుంచే 'జన్మభూమి'

నేను ఉప సర్పంచ్‌గా ఉన్నప్పుడు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం జిల్లెలగూడ నుంచే స్టార్ట్ చేశారు. వైఎస్సార్ సర్కార్ అధికారంలోకి వచ్చాక మొటిసారిగా మెట్రోవాటర్‌ను గ్రామానికి తెప్పించాను.

పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి..

కాలేజీ స్థాయిలో ఎన్ఎస్‌యుఐలో క్రియాశీలకంగా పని చేశాను. విదార్థి సంఘ ఎన్నికల్లో పోటీచేసి గెలిచాను. మా పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లో అడుగుపెట్టాను.

ఎమ్మెల్యే కావాలనే కోరిక తీరలేదు

కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్లుగా కొనసాగుతున్నాను. ఎమ్మెల్యే కావాలని చిన్నప్పటి నుంచి అనుకునేవాడిని. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్‌ను ఆశించాను. కానీ నాకు దక్కలేదు. వచ్చేసారైనా పార్టీ తనకు టికెట్ ఇస్తుందనే నమ్మకం ఉంది. అధిష్ఠానం నా సేవలు గుర్తించి తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి కట్టబెట్టింది. నా రాజకీయ గురువుల్లో మొదటగా మా పెద్దనాన్న. తర్వాత వైఎస్సార్. సరూర్‌నగర్ జెడ్పీటీసీగా అనేక సేవలందించాను.నా సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ జడ్పీటీసీగా అవార్డు అందజేసింది.

1988లో మొదటిసారిగా జిల్లెలగూడ పంచాయతీ వార్డు సభ్యుడిగా విజయం సాధించాను. ఆ తర్వాత ఉప సర్పంచ్‌గా, సరూర్‌నగర్ మండల జెడ్పీటీసీగా, జెడ్పీ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగాను. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడిగా, మలక్‌పేట్ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాను. రెండుమార్లు డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం వచ్చింది. ఇప్పటికీ ఆ పదవిలో కొనసాగుతున్నాను. నా జీవితం ప్రజలకే అంకితం. ప్రజలకు సేవ చేయడమే నా ధ్యేయం.

నాటు కోడి, జొన్న రొట్టె అంటే ఎంతో ఇష్టం

నాటుకోడి, జొన్నరొట్టే చాలా ఇష్టం. క్రికెట్, కబడ్డీ ఆటలంటే ఎంతో మక్కువ. చిన్నప్పుడు పది మంది స్నేహితులు ఉండేవారు. వారిని అప్పుడప్పుడు కలుస్తాను.



మట్టికుప్పల తొలగింపు

ఘట్‌కేసర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'సర్వీసు రోడ్డు స్వాహా' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందించారు. ఘట్‌కేసర్‌లోని బైపాస్ రోడ్డులోని సర్వీసురోడ్డుపై అక్రమంగా పోసిన మట్టి కుప్పలను శనివారం తొలగించారు. ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపులా గల సర్వీసు రోడ్లను అక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనికి తోడు తవ్వకాలు చేసిన మట్టిని సర్వీసురోడ్డుపై పోసి నెలలు గడుస్తున్నా తీయక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా అధికారులు మట్టి కుప్పలను తొలగించారు. అయితే ఆక్రమణలు, చెట్లలో కూరుకుపోయిన సూచిక బోర్డులు కనిపించే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

మేడ్చల్ నియోజకవర్గ

కాంగ్రెస్‌లో అయోమయం

- చాపకింద నీరులా గ్రూపు రాజకీయాలు
- ఎవరికి వారే బాస్‌లుగా బడా నేతలు
- సీఎం వద్దకు సీనియర్ల పంచాయితీ



మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో గందరగోళ, అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. సీనియర్లకు పార్టీలో సముచితస్థానం, గౌరవం ఇవ్వడంలేదని కొందరు గళం విప్పారు. అధికారం ఉన్నా.. లేకున్నా పార్టీ జెండాలు మోస్తూ పదేళ్లుగా పార్టీని కాపాడిన వారికి గుర్తింపు కరువైందని నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మేడ్చల్ నియోజకవర్గంలో పార్టీ సీనియర్లకు నష్టం వాటిల్లిందంటూ విమర్శలొస్తున్నాయి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీని పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిలు అంతా తామై వ్యవహరిస్తున్నారు. ఈ నేతలు ఏళ్లుగా పార్టీకి పనిచేసిన వారిని పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నాయకులకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేకగా అనుచరులున్నారు. దీంతో ఈ నాయకులు తమ అనుచరులకు తప్ప సీనియర్లను గుర్తించటం లేదన్న వాదనలొస్తున్నాయి. పార్టీ అహర్నిషలు పాటుపడ్డ వారిని అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నారి సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కొత్త వారి ప్రాబల్యం

అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న కొత్త వారికే పార్టీలో పెద్దపీట వేస్తున్నారని సీనియర్లు వాపోతున్నారు. ఇటీవల నియోజకవర్గంలోని ఆయా పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, కార్పొరేటర్లు, మేయర్లు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పార్టీలో చేరారు. వీరికి లభిస్తున్న గుర్తింపు తమకు ఇవ్వడం లేదని సీనియర్ల ఆవేదన. పార్టీ సమావేశాల్లో, ఇతర కార్యక్రమాల్లో కొత్తగా చేరిన వారికే అందలం వేస్తున్నారని సీనియర్లు నిరుత్సాహ పడుతున్నారు.

చోటుచేసుకుంటున్న గ్రూపు రాజకీయాలు

పార్టీలో సీనియర్, జూనియర్ల వివాదంతో గ్రూపు రాజకీయలు మొదలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మొత్త ముగ్గురు జిల్లా నేతలపైనే ఆధారపడటంతో ఈ నేతల అనుచరుల మధ్య తరచూ పార్టీ వ్యవహారాల్లో పోటీ పెరిగింది. సమావేశాల సమయాల్లో ఈ ముగ్గురు నాయకుల అనుచరులు పెత్తనం తీసుకోవడం సాధారణమైంది. ఇటీవల ఎన్నుకున్న మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల నియామకంలో వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డిలు ఏకపక్షంగా వ్యవహరించి హరివర్ధన్‌రెడ్డి అనుచరులకు పదవులు రాకుండా చేశారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. వారు వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డిలపై మండిపడుతున్నారు. ఈ విషయాన్ని సీనియర్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకుపోయినట్టు సమాచారం. సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సదరు నేతలకు సీఎం సూచించినా బడా నేతల్లో మాత్రం మార్పు రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పరిస్థితుల్లో మార్పురాకుంటే ఉన్న కాస్త పట్టూ సడలే ప్రమాదం ఉందని పార్టీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

తటస్థంగా ఉండలేక..

పార్టీ అంతర్గత రాజకీయ సమీకణాలతో తటస్థంగా ఉన్న సీనియర్లు గత్యంతరం లేక ముగ్గురు బడా నేతల్లో ఒకరి అనుచరులుగా మారక తప్పటం లేదని కొందరంటున్నారు. బడానేతల అండదండలుంటేనే పార్టీలో మనుగడ అన్న అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో నెలకొంది. పార్టీ, నామినేటెడ్ పదవులు పొందాలంటే ముగ్గురిలో ఎవరినో ఒకరిని తమ బిగ్ బాస్‌గా చేసుకోక తప్పడం లేదని ఒక కాంగ్రెస్ సీనియర్ పేర్కొనడం గమనార్హం. ప్రజల్లో సీనియర్లుగా గుర్తింపు ఉన్నా.. పార్టీలో మాత్రం తమకు విలువివ్వని పరిస్థితి ఉందన్నారు. ఇటీవల నియోజకవర్గంలో పార్టీ పెద్దలు నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల సమావేశంలో కొందరు సీనియర్లు ఈ విషయాన్ని బహిరంగంగానే పార్టీ పెద్దలకు చెప్పారు కూడా!.

రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తలకొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వెల్జాల జెడ్పీ పాఠశాల విద్యార్థినులు కెస్పందన ఎ.భవాని ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో డిస్ట్రిక్ట్ ఖోఖో అసోసియేషన్ నిర్వహించిన జూనియర్ స్థాయి పోటీల్లో బాలికలు ప్రతిభ చూపారు. ఈ నెల 28-30వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు స్పందన, భవానీ ఎంపికయ్యారని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పరమేశ్ శనివారం తెలిపారు. విద్యార్థినులను హెచ్ఎం నసీమా, టీచర్లు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రీనాలిసా, తపస్యలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

ఆమనగల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆమనగల్లులోని వివేకా విద్యా భారతి పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో స్కూలుకు చెందిన ఆరుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. రీనాలిసా, తపస్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరులో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థినులను శనివారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్ సత్కరించారు. పీఈటీలు శంకర్, అంజు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు కొడంగల్ బాలురు ...



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు కొడంగల్ జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు వీరేశ్, లచ్చానాయక్ ఎంపికైనట్లు పీడీ అజీజ్ తెలిపారు. వీరు అండర్-17, అండర్-14 బాలుర విభాగ రాష్ట్ర జట్లకు ఎంపికకావడంతో శనివారం వారిని హెడ్‌మాస్టర్ మురళీధర్, టీచర్లు సన్మానించారు. ఈ నెల 28-30వ తేదీ వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులను విస్మరిస్తున్న ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ ● విద్యార్థుల భారీ ర్యాలీ.. ధర్నా

పరిగి,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పరిగిలో విద్యార్థులు భారీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడతూ, కాంగ్రెస్ అధికారంలోకి పది నెలలు దాటినా విద్యార్థులకు సంబంధించి నిధుల విడుదలలో ఎందుకు జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచాలని, లేనిచో ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, వెంకటరమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మండే ఎండ.. మంచు తుపాను


(5వ పేజీ తరువాయి)

ఫొటోషూట్ స్పాట్‌ల నిర్వాహకులు. అద్దె చెల్లిస్తే చాలు.. రోజంతా మీకు నచ్చిన, మీరు మెచ్చిన స్పాట్‌లో ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చు. రంగుల ప్రపంచాన్ని అర చేతిలో వైకుంఠంగా చూపించేందుకు నిర్వాహకులు తమ నైపుణ్యానికి పదును పెట్టారు. ఇప్పటికే మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలో ల్యాండ్ ఆఫ్ లవ్,(ఎల్‌వోఎల్) పేరుతో ఓ స్పాట్ సందడి చేస్తుండగా జగ్గంగూడలో మరిన్ని షూటింగ్ స్పాట్లు వెలిశాయి.

ఒకే చోట 80కిపైగా స్పాట్లు

ఫొటో షూట్ స్పాట్లతో ఆయా గ్రామాల్లో నిత్యం సందడి వాతావరణం నెలకొం టుంది. ఫొటోషూట్ స్పాట్ల పేరుతో ఓ కొత్త ప్రపంచాన్ని కళ్ల ముందుకు తీసుకువస్తున్నారు నిర్వాహకులు. సుమారు 6 నుంచి 7 ఎకరాల్లో ఫొటోషూట్ స్టూడియో నిర్మాణాలను చేపట్టారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక పెరటి తోట, కోటను తలదన్నేలా భవనాలు, సముద్రంలో తేలియాడే పడవలు, పక్కింటికి ఉన్న పిట్టగోడ, ఔరా మెయిల్ వంటి రైల్ బండి, మండే ఎండ, మంచు తుపాను, నట్టింట నక్షత్రాలు, ఎడ్ల బండి, వ్యవసాయ పరికరాలు, విద్యుత్ కాంతుల లైట్ హౌజ్ వంటి ఎన్నెన్నో.. స్పాట్‌లు ఈ స్టూడియాల్లో దర్శనమిస్తాయి. ఒక్కో స్టూడియోలో సుమారు 80కు పైగా స్పాట్‌లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.





ఫొటో షూట్ కోసం ఏర్పాటు చేసిన ఊయల, లవ్ అక్షరాల సెట్టింగ్

ఫొటోషూట్ స్పాట్‌లకు ఆదరణ పెరగడంతో మూడు పువ్వులు 30 కాయల్లా ఈ స్టూడియోల వ్యాపారం నడుస్తూ నిర్వాహకుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

రోజుకు రూ.25వేల చొప్పున

ఒక్క ఫొటో షూట్‌కు పది మంది వరకు లోపలికి అనుమతిస్తారు. అందులోనే ఫొటోగ్రాఫర్‌తో కలిపి ఒక రోజుకు సుమారు రూ.25వేల వరకు అద్దెను వసూలు చేస్తున్నారు. అదే హాఫ్ డే కోసం అయితే రూ.14వేలను చెల్లించాల్సి ఉంటుంది. ఫొటో షూట్ కోసం వచ్చిన వారు ముస్తాబవ్వడానికి ఏసీ గదులతో పాటు తినడానికి భోజనాలను సైతం సరఫరా చేస్తారు. ఒకవేళ రాత్రి ఫొటోషూట్ చేసుకుంటే అవసరమైన లైటింగ్‌ను ఏర్పాటు చేస్తారు. నిర్వాహకులు తక్కువ ఖర్చుతో ఇలా సకల సదుపాయాలను కల్పిస్తుండటంతో యువత ఇక్కడి షూటింగ్ స్పాట్‌లలో ఫొటో షూట్‌పై ఆసక్తి చూపుతున్నారు. దీంతో శివారు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫొటో షూట్ స్టూడియోలకు డిమాండ్ భారీగా పెరింది. ఇది రోజురోజుకూ పెరుగుతోంది. ఫొటోషూట్ సదుపాయాలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో లాంగ్ టూర్, మ్యూజిక్ పార్టీలు, స్టార్ హోటళ్లను పక్కన పెట్టి మరీ ఫొటోషూట్ దారిపడుతున్నారు యువతరం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో

ఏసీబీ హడల్

ఆరు నెలల్లో ఆరుగురు అధికారుల ట్రాప్.. అయినా మారని అవినీతి ఉద్యోగుల తీరు

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ లంచగొండి అధికారుల గుండెల్లో ఏసీబీ రైళ్లు పరిగెత్తిస్తోంది. ఏసీబీ అంటేనే హడల్‌గా మారింది. ఆరు నెలల్లో ఆరుగురు అధికారులను ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయినా అవినీతి విషయంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులే ఎక్కువగా ఏసీబీ ట్రాపుల్లో పట్టుబడుతున్నారు. డిపార్ట్‌మెంట్‌లోని కాంట్రాక్ట్ ఉద్యోగులను లంచాల కోసం అధికారులు వేధిస్తుండడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా హైదరాబాద్ శివారులోనే ఉండటంతో భూముల విలువ కోట్లలో ఉంది. ధరణి ఏర్పాటుతో భూ సంబంధిత సమస్యలెక్కువయ్యాయి. ఇదే అదనుగా చిన్న పనులకు సైతం రెవెన్యూ అధికారులు రూ.లక్షల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నారు. పాస్ పుస్తకాలిచ్చేందుకు శామీర్‌పేట తహసీల్దార్ ఏకంగా రూ.10లక్షలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. గతంలో కీసర తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి ఏకంగా రూ.కోటి నగదుతో దొరికి కటకటాల పాలై చివరికి జైలులోని ఆత్మహత్య చేసుకున్నారు. అయినా లంచగొండి అధికారుల తీరులో మార్పు రాక ప్రజలు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. కలెక్టరేట్ అధికారులు కూడా లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం సంచలనంగా మారింది. ఓ సొసైటీ అధికారి, పరిశ్రమల విభాగ అధికారులు కలెక్టరేట్‌లో లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ కూడా ఓ కేసు నుంచి తప్పించేందుకు లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డాడు. తాజాగా ఘట్‌కేసర్ మున్సిపల్ ఏఈ, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లు ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులకు చిక్కారు. ప్రజలు ఎవ్వరికీ లంచాలివ్వొద్దని, ప్రభుత్వ పనులను హక్కుగా భావించి ఉద్యోగులతో చేయించుకోవాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. అయితే లంచగొండి అధికారులు మాత్రం లంచాలకు తెగబడుతూనే ఉన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ కిషన్‌గౌడ్

ప్రజల భద్రతే లక్ష్యం : ఏసీపీ

షాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా శనివారం షాబాద్‌లో సీఐ కాంతారెడ్డి ఆధ్వర్యంలో ఎంఎస్ గార్డెన్‌లో రెడ్ క్రాస్ సొసైటీ వారు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 205 మంది రక్తదానం చేశారు. ఎస్‌ఐలు నవీన్‌రెడ్డి, సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది, మండల యువకులు, రక్తదాతలు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన స్పెషలాఫీసర్

తలకొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కేజీబీవీ బాలికల పాఠశాలను శనివారం మండల ప్రత్యేక అధికారి ముత్యాలు, ఎంపీడీవో శ్రీకాంత్‌లు తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను, డైనింగ్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని వసతి గృహ అధికారి, కేజీబీవీ ఎస్‌వోకు ఆదేశించారు.


వంట కాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ముత్యాలు

మన్నించమ్మా.. మహమ్మాయిదేవి!

- వందల ఏళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయం
- ఆదిభట్ల మున్సిపాలిటీ మంగళంపల్లి వద్ద సయంభువుగా వెలసిన మహమ్మాయిదేవి
- ప్రతీయేటా కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాలు
- పాలక మండలి నిర్లక్ష్యంతో అపరిశుభ్రంగా ఆలయం
- నీట మునిగిన హనుమ విగ్రహం, కోనేరులో చెత్తాచెదారం


నీట మునిగిన హనుమాన్ విగ్రహం


మంగళ్‌పల్లి మహమ్మాయిదేవి ఆలయం


అమ్మవారు


చెత్తాచెదారంతో నిండిపోయిన కోనేరు

ఆదిభట్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళంపల్లి(మంగల్‌పల్లి) వద్ద స్వయంభువుగా వెలసిన మహిమాన్వితమైన మహమ్మాయిదేవి భక్తుల పాలిట కల్పవల్లిగా మారి పూజలందుకుంటోంది. భక్తుల పాలిట కొంగు బంగారంలా విలసిల్లుతోంది. అయితే, ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. మంగళ్‌పల్లి వద్ద పులందరి వాగుకు ఆనుకొని ప్రకృతి సోయగాల మధ్య సుందరమైన అటవీ ప్రాంతంలో మహమ్మాయి దేవి ఆలయం వందల సంవత్సరాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. రెండెకరాల విస్తీర్ణంలో ఐదు వందల ఏళ్లకు పూర్వం ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామ పెద్దలు చెబుతుంటారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఆలయం నేడు నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోంది. ప్రతీయేటా కార్తీక మాసంలో జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారు. రూ.లక్షల్లో ఆదాయం వచ్చే ఆలయం పట్ల నిర్లక్ష్యంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యపు నీడలో..

మహమ్మాయిదేవి దేవాలయ భూమికి సంబంధించి బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.పది కోట్ల విలువ ఉంటుంది. ఆలయంతో పాటు పరిసర ప్రాంతం మొత్తం 5.20 ఎకరాలు. గుడి ప్రహరీ పక్కనే రెండు మంచినీటి కోనేర్లు ఉన్నాయి. అందులోని ఓ కోనేరు నీటితో అమ్మవారు, శివుడికి అభిషేకాలు నిర్వహిస్తారు. కాగా, మండు వేసవిలో సైతం నీటితో నిండుగా ఉండటం ఈ కోనేర్ల ప్రత్యేకత. గతంలో పదేళ్ల కరువు వచ్చిన సమయంలో సైతం ఆలయంలో నీటి కొరత లేదని గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయం గర్భగుడి కింది నుంచి స్వచ్ఛమైన నీటి ఊట నిరంతరం కోనేరులోకి చేరుతుంటుంది. నిత్యం అభిషేకాల కోసం నీరు అందుబాటులో ఉండేందుకు స్వయంగా అమ్మవారి కృప వల్లనే ఇది సాధ్యమని భక్తుల నమ్మకం. అయితే, ఎంతో పవిత్రమైన కోనేరు నేడు చెత్తాచెదారంతో నిండిపోయింది. నెలల తరబడి మురికి నీటిని తొలగించేందుకు పాలక మండలి కనీసం ప్రయత్నం చేయడంలేదు. అదేవిధంగా ఆలయంలో ఉన్న హనుమంతుడి విగ్రహం కూడా నీట మునిగింది. కాగా, ఈ ప్రాంతంలో వీర బ్రహ్మేంద్రస్వామి నడయాడిన నేలగా ఓ కథ ప్రచారంలో ఉంది. ఇంతటి చారిత్రాత్మకమైన ఆలయం పట్ల పాలక మండలి నిర్లక్ష్యంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయం పట్ల నిర్లక్ష్యం తగదు



శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయం పట్ల నిర్లక్ష్యం తగదు. సాక్షాత్తు వీరబ్రహ్మేంద్రుడు నడియాడిన నేలగా ఈ ప్రాంత ప్రసిద్ధి. కోనేటిలో చెత్తాచెదారం చేరి నెలలు గడుస్తున్నా పాలకమండలి చర్యలు తీసుకోకపోవడం లేదు. కార్తీకమాసం ప్రారంభానికి ముందే యుద్ధ ప్రాతిపాదికన కోనేటిని శుద్ధిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలి.

- అండెకార్ మనోహర్‌లాల్
బీజేపీ నాయకుడు, ఆదిభట్ల మున్సిపాలిటీ

హైడ్రా పేరుతో ఆరు గ్యారెంటీలు పక్కకు..

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కకు పెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పెద్ద డ్రామా ఆడుతోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. శనివారం మహేశ్వరంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యంతో పాటు వృద్ధాప్య పింఛన్లు, కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం, గ్యాస్ సబ్సిడీ, రైతుబీమా వంటి అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా రైతు రుణమాఫీ ఒకటని, కానీ దానిని పూర్తి స్థాయిలో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రైతు బంధును పక్కకు పెట్టి అరకొర రైతు రుణమాఫీ చేయడంతో రాష్ట్ర రైతాంగం చాలా ఇబ్బందులు పడుతుందన్నారు. గ్రామపంచాయతీ వ్యవస్థను అస్తవ్యస్తం చేసి గ్రామాలను గాలికొదిలేసి కార్మికులకు కనీస వేతనం చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు. మిషన్ భగీరథ, శానిటేషన్ వంటి విషయాల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులనే కాకుండా విద్య, వైద్యం వంటి ప్రధాన శాఖలను కూడా ముఖ్యమంత్రి వీధులపాలు చేశాడన్నారు. మళ్లీ రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఏ ఒక్కరికీ గ్యాస సబ్సిడీ అందలేదని అన్నారు. తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజారెడ్డి, ఆర్‌ఐ స్వర్ణకుమారి, బీఆర్ఎస్ నాయకులు పాండుయాదవ్, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్, ప్రభాకర్‌రెడ్డి, పోతుల నర్సింగ్‌పటేల్, సుధీర్‌గౌడ్, సమీర్, రాజేష్, కె.ప్రభాకర్, పి.బాలయ్య, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి : ఎమ్మెల్యే


మదన్‌పల్లి పాత తండా ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్‌రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో ప్రజాప్రనిధులతో పాటు ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మదన్‌పల్లి పాత తండాలో సేవాలాల్ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ నీలా మోహన్‌నాయక్‌తో శనివారం ప్రారంభిచారు. నీలా మోహన్‌నాయక్ రూ.18 లక్షల సొంత నిధులతో నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా మెహన్‌నాయక్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నీరటి రాజు, దూడల వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు దండు ఇస్తారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట : కసిరెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.92వేలు మంజూరయ్యాయి, శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు వైద్య చికిత్సలకు రూ.10లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, కడ్తాల్ మైసిగండి వద్ద ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో రూ.17.50కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. తలకొండపల్లి, గట్టిప్పల పల్లి, ఇర్విన్ మాడ్గుల ఆసుపత్రులను ఆధునీకరిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో బీటీరోడ్లకు రూ.204కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇటికాల జయమ్మ, సంపత్, మెకానిక్ బాబా, తాళ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాషా, నరహరిల సేవలు మరువలేనివి


ఇబ్రహీంపట్నం : పాషా, నరహరి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


యాచారం : చింతపట్లలో పాషా, నరహరిల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం/యాచారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాషా నరహరిల సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం పాషా నరహరి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సామ్యేల్, మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్, నాయకులు బుగ్గరాములు, నర్సింహ, వెంకటేష్, మునలయ్య, కృష్ణ, యాదగిరి, స్వప్న, షఫీయున్నీసా తదితరులున్నారు. అదేవిధంగా పాషా, నరహరిల ఆశయాలను నెరవేర్చేందుకు కమ్యునిస్టులు కృషి చేయాలని సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పిలుపునిచ్చారు. మేడిపల్లి, చింతపట్ల, కొత్తపల్లి తదితర గ్రామాల్లో పాషా, నరహరిల చిత్రపటాలకు కార్యకర్తలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆలంపల్లి జగన్, వెంకటయ్య, యాదగిరి, మల్లేష్ తదితరులున్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి


షాద్‌నగర్‌రూరల్ : సభ్యత్వ నమోదులో విష్ణువర్ధన్‌రెడ్డి

చౌదరిగూడ/షాద్‌నగర్ రూరల్/ యాచారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చౌదరిగూడ మండల పరిధిలో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా సూచించారు. శనివారం చౌదరిగూడ మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు భూపాల్ చారి, జిల్లా సభ్యత్వ నమోదు కో-కన్వీనర్ మనోహర్‌రెడ్డి, రామ్‌లక్ష్మణ్, రాజు, బల్వంత్ వెంకటేష్, హరీశ్ పటేల్, రాము, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పరూఖ్‌నగర్ మండలం మధురాపూర్, గంట్లవెల్లి, కమదనం, చిల్కమర్రి, వెలిజర్ల, కొండన్నగూడ, దూసకల్ గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సుదాకర్, నరెందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రవీణ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు దక్కించుకునేందుకు కార్యకర్తలు చొరవ తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. యాచారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వాన్ని ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాగటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం


ఎస్సైకి విరాళం అందిస్తున్న వర్తక వ్యాపార సంఘం నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధన, చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడుతాయని ఎస్‌ఐ శ్రీకాంత్ అన్నారు. మండలం కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ.లక్ష సమకూర్చారు. శనివారం పోలీసు స్టేషన్ వద్ద స్థానిక నాయకులు, ట్రస్ట్ సభ్యులు ఎస్సై శ్రీకాంత్‌కు సీసీ కెమెరాలకు డబ్బును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, నాయకులు కండె జగదీశ్వర్, పోతుగంటి యాదయ్య, కటికెల శేఖర్, జంగయ్య, మల్లేశ్, శ్రీను, రవికుమార్, వెంకటయ్య, పాండు, యాదయ్య, సత్తయ్య, మల్లేశ్, మహేశ్, శ్రీరాములు, మహేశ్, ప్రశాంత్, దీప్ల, రవి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కేశంపేట/షాద్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కేశంపేట మండలం నిర్దవెల్లికి చెందిన బద్క పూజకు రూ.2.50లక్షలు, తొమ్మిదిరేకులకు చెందిన అల్వాల తిరుపతయ్యకు రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీలు మంజూరయ్యాయి. శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వై.యాదయ్య యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాస్కర్‌గౌడ్, నాయకులు రమేష్, కరుణాకర్‌రెడ్డి, ముత్యాలు, రాజేందర్ రెడ్డి, బద్క తిరుపతయ్య తదితరులున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. పనులకు సంబంధించి ఆయన మార్కింగ్ చేశారు.


ఎల్వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ఆవరణలో ప్రారంభించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ డి.చంద్రశేఖర్ కోరారు. శనివారం ఆ సంఘం డైరక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తూరుకు చెందిన(గఫూర్‌నగర్) పొట్టి ఆనంద్ ఇటీవల డీసీసీబీ డైరక్టరుగా నియామకమై బాధ్యతలు తీసుకోగా పాలక వర్గం సభ్యులతో కలిసి చైర్మన్ చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆదిభట్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుండే పోలీస్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ రూట్స్ ప్లే స్కూలు యాజమాన్యం విద్యార్థులను ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. స్టేషన్ పోలీస్ స్టేషన్ నడిచే విధానం, ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్, రిమాండ్‌కు తరలించే వరకు జరిగే ప్రక్రియను వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

షాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వన్ సేవింగ్ బ్యాంక్ ఇండియా చైర్మన్ లారెన్స్ అన్నారు. చందన్‌వెల్లిలో వన్ సేవింగ్ బ్యాంక్ ఇండియా, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వాలంటరీ

సంక్షిప్త సమాచారం

ఆర్గనైజేషన్ సంయుక్తంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో 500 అశోక మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య, మహేందర్‌రెడ్డి, రాంచందర్‌రావు, రమేష్, గోపాల్, సత్తయ్య, కిష్టయ్య, శ్రీహరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కేశంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన కొండకళ్ల జంగయ్య ఇటీవల ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ గౌడ్ రూ.5వేలు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ తరఫున మృతుడి కుటుంబానికి రూ.4వేలు అందించారు. బాల్‌రాజ్ గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

శంషాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో శనివారం సాయంత్రం ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు ఐకాస డ్రైవర్ల మహాధర్నా పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 29న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని అన్ని డ్రైవర్ల యూనియన్లకు చెందిన వారు ఈ మహాధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐకాస నాయకులు కోరారు. యూనియన్ నాయకులు నందకిషోర్, సయ్యద్, రవీందర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల పెరుగుదల

చౌదరిగూడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతల నిర్మాణంతో మురుగు నీరు నియంత్రించడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లాల్‌పహాడ్‌లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యదర్శి రాములు, టీఏ వినోద్‌కుమార్, ఈసీ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి నిర్మాణం

తలకొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డి పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి నిర్మాణం పూర్తైంది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించిన వెంకటేశ్‌కు, సహకరించిన మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, మాజీ ఉప సర్పంచ్ మల్లేశ్ లకు అంగన్‌వాడీ టీచర్ గిరిజ కృతజ్ఞతలు తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

ఆమనగల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎస్‌టీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం అజిలాపూర్‌నకు చేరుకున్న కార్యకర్త కాలె శివలింగంను ఆచారి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

క్రైం కార్నర్

రిటైర్డ్ టీచర్‌కు నకిలీ సాధువుల టోకరా

- మాయమాటలు చెప్పి బంగారు ఉంగరం ఎత్తుకెళ్లిన వైనం
- బాధితుడి ఫిర్యాదు.. పోలీసులకు చిక్కిన నలుగురు దుండగులు

యాచారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మీ చేతికి ఉన్న బంగారు ఉంగరానికి పూజ చేసి ఇస్తామని నమ్మించి తీరా ఉంగరం కాజేసి పారిపోయిన నలుగురు నకిలీ సాధువులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శంకర్‌కుమార్ వెల్లడించారు. ఈనెల 23న బుధవారం తక్కళ్లపల్లి గేటు వద్ద నిలబడి ఉన్న రిటైర్డ్ టీచర్ దెంది మాధవరెడ్డి వద్దకు నలుగురు నకిలీ సాధువులు కారులో వచ్చి విశ్రాంతి తీసుకుంటాం, దగ్గర ఎక్కడైనా దేవాలయాలున్నాయా? అని ఆరా తీశారు. ఈక్రమంలో మాధవరెడ్డితో మీ చేతికున్న బంగారు ఉంగరం తీసి ఇస్తే పూజ చేస్తామని, మీరు అనుకున్నది సాధిస్తారని నమ్మించారు. అనంతరం ఆయనకు రుద్రాక్షమాలతో పాటు విభూతి ఇచ్చారు. కొద్దిసేపు ఆగండని నమ్మించి ఉంగరం కాజేశారు. దుండగుల మాటలకు మోసపోయిన అతను కొద్దిసేపు తరువాత తనకు మోసం జరిగిందని నిర్ధారించుకున్నాడు. వెంటనే యాచారం పోలీసులకు తెలిపాడు. శుక్రవారం రాత్రి మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు దుండగులు పోలీసులకు చిక్కారు. గుజరాత్‌కు చెందిన కవర్నాథ్, సావ్‌నాథ్, పర్దేశీనాథ్, ప్రేమ్‌నాథ్‌లుగా నిర్ధారించారు. మాధవరెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి విచారించడంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శంకర్‌కుమార్, ఎస్సై మధులు చెప్పారు.

భార్యాభర్తల గొడవ..
మనస్తాపంతో భర్త ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా భర్త మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలోని చటాన్‌పల్లి శివారులో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. సోలీపూర్ గ్రామానికి చెందిన పినపాక రమేష్(43), లలిత దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఏడాది క్రితం కూతురు వివాహం చేశారు. కుమారుడు షాద్‌నగర్‌లోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. అయితే, భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. శనివారం ఉదయం కూడా గొడవ పడ్డారు. దాంతో మధ్యాహ్నం సోలీపూర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో భర్త రమేష్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ మాస్టర్ వెంకట్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసుల్లో 11 మంది రిమాండ్

మహేశ్వరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా వివిధ దోపిడీలు, దొంగతనాలు చేస్తూ పట్టుబడిన 11మందిని మహేశ్వరం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి శనివారం సాయంత్రం మహేశ్వరం పోలీసుస్టేషన్లో వెల్లడించారు. బూత్పూరు, మహబూబ్‌నగర్, శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, మోకిల్ల, బానూరు, హఫీజ్‌పేట్, వెలిమెల్ల, దొంతునపల్లి ప్రాంతాలకు చెందిన రాము, వెంకటేష్, సునీల్, వెంకటేష్, నూతన్, రాకేష్, శ్రీధర్, అనిల్, శివ, అనిల్‌లు.. డ్రైవర్, దినసరి కూలీ, మటన్‌షాపు నిర్వహణ తదితర పనులు చేస్తూ ఒక జట్టుగా ఏర్పడి ఈ నెల 17న మండలంలోని సిరిగిరిపురం రెవెన్యూ పరిధి కైలాష్ కౌంటీలో అల్యూమినియం సామగ్రిని దొంగిలించారు. 21న మళ్లీ సిరిగిరిపురం లోని కైలాష్ కైంటీలో సామగ్రిని దొంగిలించి రాము అనే వ్యక్తి వాహనంలో తరలించి 11 మందిలో ఒకరైన రాకేష్‌కు విక్రయించారు. 23 న రాము, అనిల్, శివలు మళ్లీ అల్యూమినియం సామగ్రిని దొంగిలించారు. 23న రాత్రి పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని చూసి దొంగతనానికి ఉపయోగించిన ఆటో వాహనాన్ని మన్‌సాన్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు. 26న ఉదయం ఆటోను తీసుకెళ్లడానికి వచ్చి పోలీసులకు పట్టుబడ్డారు. ఆరుగురిని విచారించగా తమతో పాటు మరో 5మంది ఉన్నారని చెప్పడంతో మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకొని అల్యూమినియం సామగ్రితో పాటు రూ.9.70 లక్షలు, 11 సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

వృద్ధుడు అదృశ్యం.. కేసు నమోదు


బాల్‌రాజ్ గౌడ్(ఫైల్)

కేశంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పొలం వద్దకు వెళ్తానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాలేదు. ఈ ఘటన మండలంలోని కాకునూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన తాళ్ల బాల్‌రాజ్‌గౌడ్ అనే వృద్ధుడు శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఫలితం లేకపోయింది, శనివారం జడ్చర్ల మండలం గంగాపురం వద్ద వృద్ధుడి ఫొటో చూపించగా.. శుక్రవారం సాయంత్రం 4గంటల సమయంలో హోటల్ సమీపంలో కనిపించాడని ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాడో తెలియదని హోటల్ నిర్వాహకులు తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో తెలుపు రంగు షర్టు, పంచె ధరించి ఉన్నాడని, ఎరుపు వర్ణంలో ఉంటాడని, కుడికన్నుపై కణితి ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు కేశంపేట ఎస్సై నెంబర్: 8712568396కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్‌రాజ్ గౌడ్ కుమారుడు తాళ్ల శివశంకర్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

శంకర్‌పల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కారుకు సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి వస్తున్న బైక్ అదుపుతప్పి కారును ఢీకొంది. బైక్ నడుపుతున్న విద్యార్థి భరత్‌కుమార్(15) కిందపడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, మరో విద్యార్థి చరణ్‌కు గాయాలయ్యాయి. నవాబుపేట్ మండలం శేరిగూడకు చెందిన విద్యార్థులు భరత్‌కుమార్, చరణ్‌లు శంకర్‌పల్లిలోని శ్రీవివేకానంద హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. శనివారం పాఠశాలలో ప్రత్యేక తరగతులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామం శేరిగూడకు సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బయలుదేరారు. రామంతాపురం దాటిన తరువాత ముందు వెళుతున్న పార్చునర్ కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాంతో బైక్ నడుపుతున్న భరత్‌కుమార్ కారును ఢీకొట్టాడు. తీవ్రగాయాలై భరత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా.. గాయాలైన చరణ్‌ను కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కుమారుడు భరత్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు లక్ష్మి, దేవేందర్‌లు కన్నీరుమున్నీరయ్యారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం


అయ్యప్ప స్వాములతో నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలం నుంచి శబరిమలై వరకు గురుస్వామి శ్రీ ఉమా శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాములు మహాపాదయాత్రగా ఇటీవల తరలివెళ్లారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఏపీలోని కర్నూల్ జిల్లా పెద్దవేడు ప్రాంతానికి పాదయాత్ర చేరుకుంది. చేవెళ్ల మండలంలోని కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లి అక్కడ స్వాములను కలిసి వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, మల్కాపూర్ గురుస్వామి సీహెచ్ వెంకటేశ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, నాయకులు శివకుమార్‌గౌడ్, దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ మహాసభకు తరలిరావాలి

చేవెళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భానుప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పలు కళాశాల విద్యార్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 29న తుక్కుగూడలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆవశ్యకతను వివరించి వర్గీకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిరసనగా మాదిగల ఆవేదన చూపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాదిగల ధర్మయుద్ధ మహాసభకు మాదిగ ప్రజలు, నిరుద్యోగులు, మాదిగ విద్యార్థులు, పెద్దఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. సమావేశంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.